కంపు కొడుతున్న కాలనీలు


ఎంపీడీవో కార్యాలయం పక్కన పేరుకుపోయిన చెత్త


కోనరావుపేటలో రోడ్డుపక్కన పారుతున్న మురుగు

- ఇళ్లలోనే పేరుకుపోతున్న చెత్త
- మూలకు పడిన జీపీ ట్రాక్టర్
- పట్టించుకోని ప్రత్యేకాధికారి
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు



ఈ చిత్రంలో కనిపిస్తున్నది మండలకేంద్రంలోని గ్రామ పంచాయతీ ట్రాక్టర్. పది రోజులుగా డీజిల్ లేక మూలకుపడింది. కోనరావుపేట పెట్రోల్ బంక్‌లో రూ.1.10 లక్షల డీజిల్ బిల్లు పెండింగ్‌లో ఉంది. వారు డీజిల్ పోసేందుకు నిరాకరిస్తున్నారు. జీపీలో రూ.3 లక్షలు ఉన్నా అవి తీసేందుకు ప్రత్యేకాధికారి అనుమతి ఇవ్వడంలేదు. ట్రాక్టర్ మూలకుపడటంతో గ్రామంలోని చెత్తా చెదారం, ఇళ్లలో వ్యర్థాలు పేరుకుపోతున్నాయి. ఫలితంగా దుర్గంధం వ్యాపిస్తోంది.

కోనరావుపేట: మండలకేంద్రంలో పారిశుద్ధ్య పనులు నిలిచిపోయాయి. ఎక్కడి చెత్త అక్కడే పేరుకుపోతుండటంతో వీధులన్నీ కంపుకొడుతున్నాయి. పారిశుద్ధ్య పనులు చేయకపోగా ఐదురోజుల నుంచి వీధిదీపాలు కూడా వెలగడంలేదు. దీంతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు.

డీజిల్ బకాయి రూ.1.10 లక్షలు

కోనరావుపేట మండలకేంద్రంలోని జీపీ ట్రాక్టర్ ద్వారా ఇళ్లలోని చెత్తను సేకరించేవారు. ఇందుకు స్థానిక పెట్రోల్ బంక్‌లో డీజిల్ ఉద్దెర బిల్లు రూ.1.10 లక్షలకు చేరింది. దీంతో వారు డీజిల్ ఉద్దెర పోయడం లేదు. ఫలితంగా పది రోజులుగా మూలకుపడి ఉంటుంది. రెండ్రోజుల క్రితం యూత్ సభ్యులు వినాయకుడి వద్ద అన్నదానం చేస్తే వ్యర్థాలను ట్రాక్టర్‌లో వేసేందుకు వారే సొంత ఖర్చులతో డీజిల్ పోయించుకొని ట్రాక్టర్‌ను తీసుకెళ్లారు.

స్పందించని ప్రత్యేకాధికారి

సర్పంచుల పదవీకాలం పూర్తవడంతో గ్రామాలకు ప్రత్యేకాధికారులను నియమించారు. కోనరావుపేటకు ఎంపీడీవో ప్రత్యేకాధికారి. ప్రతిరోజూ మండల కేంద్రానికి వస్తున్నా గ్రామ పంచాయతీని సందర్శించిన దాఖలాలు లేవని గ్రామస్తులు పేర్కొంటున్నారు. ప్రత్యేకాధికారి అనుమతి లేనిది డబ్బులు తీసే అవకాశం లేకపోవడంతో కార్యదర్శి ఏమీ చేయలేని స్థితిలో ఉన్నాడు. వీటికి తోడు ఇతర ఖర్చుల నిర్వహణకు ఇబ్బందులు పడుతున్నారు.

వీధిదీపాలు ఏర్పాటు చేయడం లేదు



మండలకేంద్రంలో పారిశుద్ధ్య పనులు సక్రమంగా లేవు. పది రోజులుగా ట్రాక్టర్ తిరగడం లేదు. ఐదు రోజులుగా వీధి దీపాలు వెలగడం లేదు. ఇళ్లలో చెత్త నిల్వలు పెరుకుపోవడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. అధికారులు స్పందించి సమస్యలు పరిష్కరించాలి.

–దేవరకొండ నర్సింహచారి, మాజీ ఎంపీటీసీ

ఓటరు జాబితాలో అభ్యంతరాలు తెలపాలి


వేములవాడరూరల్: పార్టీల నాయకులతో సమావేశమైన ఎంపీడీవో శ్రీనివాస్


ఇల్లంతకుంట : సమావేశమైన ఎంపీడీవో శశికళ

వేములవాడరూరల్: గ్రామాలవారీగా ఓటరు జాబితాలో అభ్యంతరాలుంటే తెలపాలని ఎంపీడీవో శ్రీనివాస్ ఆయా పార్టీల నాయకులకు సూచించారు. వేములవాడ రూరల్ మండల పరిషత్ కార్యాలయంలో అన్ని పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ఇటీవల గ్రామాలవారీగా ఓటరు జాబితా వివరాలను గ్రామ పంచాయతీ కార్యాలయాలకు అంటించినట్లు తెలిపారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వకుళాభరణం శ్రీనివాస్, బీఆర్ఎస్ నాయకులు గొస్కుల రవి, బీజేపీ నాయకులు జక్కుల తిరుపతి, సీపీఐ నాయకులు రాములు, సీపీఎం నాయకులు అశోక్ తదితరులున్నారు.

బోయినపల్లి: మండలకేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో మండల రాజకీయ పార్టీల నాయకులతో ఎంపీడీవో బీమా జయశీల అవగాహన సమావేశం నిర్వహించారు. ఎంపీడీవో మాట్లాడుతూ గ్రామపంచాయతీ ఎన్నికలకు సంబంధించిన ఓటరు జాబితాలను అన్ని గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో అంటించినట్లు తెలిపారు. ఓటరు జాబితాపై అభ్యంతరాలు ఉంటే తెలపాలన్నారు.

సమావేశంలో ఎంపీవో శ్రీధర్, రవీందర్, సురేశ్, బీఆర్ఎస్, బీజేపీ, సీపీఎం మండల అధ్యక్షులు కత్తెరపాక కొండయ్య, గుడి రవీందర్‌రెడ్డి, గురజాల శ్రీధర్, నాయకులు శంకర్ తదితరులుఉన్నారు.

రుద్రంగి: మండల పరిషత్ కార్యాలయంలో అన్ని రాజకీయ పార్టీల నాయకులతో ఎంపీడీవో నటరాజ్ సమావేశమయ్యారు. అభ్యంతరాలు, సూచనలు, సలహాలను పరిశీలించి ఉన్నతాధికారులకు నివేదిస్తామన్నారు. ఎంపీవో సుధాకర్, అన్ని రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

ఇల్లంతకుంట: మండల పరిషత్ కార్యాలయంలో వివిధ పార్టీల నాయకులతో ఎంపీడీవో శశికళ సమావేశమయ్యారు.ఓటర్ లిస్టులో అభ్యంతరాలుంటే 21లోపు మార్పులు చేసుకోవచ్చన్నారు. బీజేపీ మండల కన్వీనర్ దేశెట్టి శ్రీనివాస్, బీఆర్ఎస్ నాయకులు భూమయ్య, సీపీఎం నాయకులు మంద అనిల్, తదితరులు పాల్గొన్నారు.

వీర్నపల్లి: మండల పరిషత్ కార్యలయంలో ఎంపీడీవో రఘురాం ఆధ్వర్యంలో వివిధ రాజకీయ పార్టీ ప్రజాప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఎంపీడీవో, పార్టీల నాయకులు పాల్గొన్నారు.

కుదుటపడిన స్థానాచార్యుడి ఆరోగ్యం


భీమాశంకరశర్మను సన్మానిస్తున్న ఆది శ్రీనివాస్

వేములవాడ: వేములవాడ రాజన్న ఆలయ స్థానాచార్యులు అప్పాల భీమాశంకర శర్మ ఆరోగ్యం కుదుటపడింది. దంత సంబంధిత సమస్యతో సతమతమవుతూ హైదరాబాద్‌లో ఆపరేషన్ పూర్తి చేసుకొని వేములవాడకు చేరుకున్నారు. ఈనెల 18న విధులకు హాజరయ్యారు. ఈ సందర్భంగా రాజన్న దర్శనం కోసం వచ్చిన ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ స్థానాచార్యుల ఆరోగ్య సమాచారం తెలుసుకుని సత్కరించి మరింత ఆరోగ్యంగా ఉండాలని రాజన్నను వేడుకున్నారు.

కొనేందుకు వచ్చి.. చోరీచేశారు

ముస్తాబాద్: చీరలు కొంటామంటూ వచ్చి.. గుర్తు తెలియని మహిళలు చోరీకి పాల్పడ్డారు. వివరాల్లోకి వెళ్తే.. ముస్తాబాద్ కొత్త బస్టాండ్‌లో లిస్రిక సారీ సెంటర్‌లోకి గురువారం ముగ్గురు మహిళలు చీరలు కొనేందుకు వెళ్లారు. చీరలు చూపిస్తుండగా దుకాణం యజమాని గాడిచర్ల నరేశ్‌ను మభ్య పెట్టి పది చీరలను ఎత్తుకెళ్లారు. నరేశ్‌కు సీసీ కెమెరాలను పరిశీలించి ఎస్సై గణేశ్‌కు ఫిర్యాదు చేశాడు. సుమారు రూ.10వేల విలువైన చీరలు చోరీకి గురయ్యాయని తెలిపాడు. నెలరోజుల క్రితమే నరేశ్ గ్రామమైన చిప్పలపల్లిలోని ఇంట్లో దొంగలు పడి రెండున్నర తులాల బంగారు ఆభరణాలు ఎత్తుకెళ్లారు.

సంక్షిప్త వార్తలు

● అన్నపూర్ణ ప్రాజెక్టులో 3.02 టీఎంసీల నీరు

ఇల్లంతకుంట : మండలం అనంతగిరి అన్నపూర్ణ ప్రాజెక్టులో 3.02 టీఎంసీల నీరు నిల్వఉంది. మధ్య మానేరు నుంచి 3,200 క్యూసెక్కుల నీరు అన్నపూర్ణ ప్రాజెక్టులోకి వస్తుందని, సిద్దిపేట జిలా రంగనాయక సాగర్ ప్రాజెక్టులోకి 3,300 క్యూసెక్కుల నీరు వెళ్తున్నట్లు అధికారులు తెలిపారు.

● ప్రభుత్వ పాఠశాల సందర్శన

సిరిసిల్ల అర్బన్: సిరిసిల్ల మున్సిపల్ పరిదిలోని చంద్రంపేట ప్రభుత్వ పాఠశాలను బీఆర్ఎస్ విద్యార్థి విభాగం రాష్ట్ర నాయకుడు కంచర్ల రవిగౌడ్ గురువారం సందర్శించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. బీఆర్ఎస్ జిల్లా నాయకులు మట్టె శ్రీనివాస్, కోడం వెంకటేశ్, నరేశ్, సాయి, తిరుపతి పాల్గొన్నారు.

● రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్ర గాయాలు

చందుర్తి: మండలంలోని మర్రిగడ్డ శివారు మూలమలుపు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మండలకేంద్రానికి చౌటుపల్లి రవికి తీవ్రగాయాలయ్యాయి. చందుర్తికి చెందిన రవిని వేములవాడ వైపు వెళ్తున్నాడు. వేములవాడ నుంచి చందుర్తి వైపు వస్తున్న వ్యాన్ మర్రి గడ్డ శివారు మూలమలుపు వద్ద ఢీకొంది. ఈ ఘటనలో రవికి తీవ్రగాయాలుకాగా అంబులెన్స్‌లో వేములవాడ ఏరియా ఆస్పత్రికి తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఏఎస్సై బాపు తెలిపారు.

● తాగునీటి సమస్యను పరిష్కరించాలి

తంగళ్లపల్లి: మండలంలోని చిన్నలింగాపూర్ ఎస్సీ కాలనీలో తాగునీటి సమస్యను పరిష్కరించాలని మహిళలు ఖాళీ బిందెలతో గ్రామపంచాయతీ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. మూడునెలల నుంచి తాగునీరు రావడం లేదని, అధికారులు నీటి సమస్యను పరిష్కరించాలని కోరారు.

● సన్మానం

వేములవాడఅర్బన్: వేములవాడ మండలం అగ్రహారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని అధ్యాపకుడు ఎస్ కృష్ణప్రసాద్‌కు ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి డాక్టరేట్ పట్టా పొందినట్లు కళాశాల ప్రిన్సిపాల్ శంకర్ తెలిపారు. ఈసందర్భంగా ఆయనను అధ్యాపకులు ఘనంగా సన్మానించారు.

● పోషకాహారం తీసుకోవాలి

వేములవాడరూరల్: వేములవాడ మండలంలోని లింగంపల్లి గ్రామంలో పోషకాహారంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. పోషణ మాసం సందర్భంగా గర్భిణులు, బాలింతలకు 7నెలల నుంచి ఆరేళ్ల పిల్లలకు, కిషోర బాలికలకు రక్తహీనత పరీక్షలు నిర్వహించారు. రక్తహీనత లేకుండా తీసుకోవాల్సిన పోషకాహారంపై ప్రదర్శన నిర్వహించారు.

● ముందస్తు అరెస్ట్

చందుర్తి : రుణమాఫీపై నిరసన తెలిపేందుకు తలపెట్టిన చలో హైదరాబాద్ కార్యక్రమానికి తరలివెళ్తున్న బీఆర్ఎస్ నాయకులను పోలీసులు గురువారం ముందస్తు అరెస్టు చేశారు. చందుర్తి సింగిల్ విండో అధ్యక్షుడు తిప్పని శ్రీనివాస్, మాజీ వైస్ఎంపీపీ మందాల అబ్రహం, మాజీ మండల కోఆప్షన్ సభ్యులు బత్తుల కమలాకర్, లింగంపేట మాజీ ఎంపీటీసీ సభ్యులు పెగ్గర్ల రమేశ్‌రావు, మాజీ ఎంపీపీ భర్త రమేశ్‌ను అదుపులోకి తీసుకొని వదిలేశారు.

తంగళ్లపల్లి: మండలం నుంచి బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ప్రజాభవన్ ముట్టడించేందుకు వెళ్తున్నారనే పలువురు బీఆర్ఎస్ నాయకులను పోలీసులు ముందస్తు అరెస్టుచేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. మాజీ జిల్లా సర్పంచుల ఫోరం అధ్యక్షుడు మాట్ల మధు, మాజీ జెడ్పీటీసీ కోడి అంతయ్య, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గజభీంకార్ రాజన్న, యూత్ సీనియర్ నాయకుడు కేఏపాల్ ఫేమ్ అబ్బాడి అనిల్ రెడ్డి లను ముందస్తు అరెస్టుచేశారు.

● క్రీడాపోటీలు ప్రారంభం

వేములవాడరూరల్: వేములవాడ మండలంలోని నూకలమర్రి ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ పోటీలను ప్రారంభించారు. విద్యార్థులు విద్యతో పాటు అన్ని క్రీడల్లో రాణించాలని ఉపాధ్యాయులు సూచించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు సదానందం, జీఎఫ్ కన్వీనర్ రమేశ్, జ్యోతి, రవీందర్‌రావు, హమీద్, శ్రీనివాస్, తదితరులున్నారు.

● సభ్యత్వ నమోదును పూర్తిచేయాలి

ఇల్లంతకుంట: మండలంలో బీజేపీ సభ్యత్వ నమోదును ఈనెల 25లోపు పూర్తిచేయాలని కరీంనగర్ బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి అన్నారు. మండలంలోని ముస్కాన్‌పేటలో పార్టీ కార్యకర్తలతో సభ్యత్వ నమోదుపై సమావేశం నిర్వహించారు. బీజేపీ మండల ఇన్‌చార్జి నాయకుడు మహిపాల్ రెడ్డి, మండల పార్టీ కన్వీనర్ దేశెట్టి శ్రీనివాస్, హరీశ్ తదితరులు పాల్గొన్నారు

● నాణ్యమైన విద్య అందించాలి

వీర్నపల్లి: మండలంకేంద్రంలో మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్‌ను మండల పాఠశాలల అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో మాజీ మండల ప్రజాప్రతినిధులు, నాయకులు గురువారం సన్మానించారు. ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని కోరారు. సెస్ డైరెక్టర్ మల్లేశం, పాఠశాలల అభివృద్ధి కమిటీ చైర్మన్ అరుణ్‌కుమార్, కార్యదర్శి నారాయణ, బంజార సంఘం జిల్లా అధ్యక్షుడు సురేశ్ నాయక్, నాయకులు భగవంతం, వినోద్, దేవరాజు కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

● విజయవంతం చేయాలి

సిరిసిల్ల అర్బన్: చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా భవన నిర్మాణ రంగం ప్రధాన కార్యదర్శి ఎగమాటి ఎల్లారెడ్డి అన్నారు. పట్టణంలో కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు.రాష్ట్రంలో 25 లక్షల మందికిపైగా భవన నిర్మాణ కార్మికులు ఉన్నారని, కేంద్రచట్టంలోని పెన్షన్, స్కాలర్‌షిప్, గృహవసతి, అడ్డాల్లో మౌలిక సౌకర్యాలు వంటి సంక్షేమ పథకాలు అమలు కావడం లేదన్నారు. ప్రభుత్వం కార్మికులకు కొత్త సంక్షేమ పథకాలు ప్రవేశపెడుతుందని ఆశించినా నిరాశే మిగిలిందన్నారు. సహాయ కార్యదర్శి శ్రీధర్, కార్మికులు పాల్గొనారు.

● రేపు సామాజిక తనిఖీ ప్రజావేదిక

తంగళ్లపల్లి: మండలంలోని 30 గ్రామాల్లో 2023-24 వరకు ఉపాధిహామీ పథకం కింద చేపట్టిన వివిధ పనులకు సంబంధించి సామాజిక తనిఖీల ప్రజావేదిక కార్యక్రమాన్ని శనివారం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో లక్ష్మీనారాయణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీడీవో కార్యాలయం వద్ద ప్రజావేదిక నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈజీఎస్ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, అధికారులు హాజరుకావాలని కోరారు.

● ఇంట్లో సామగ్రి దగ్ధం

గంభీరావుపేట: మండలకేంద్రానికి చెందిన బచ్చు కృష్ణమూర్తికి చెందిన ఇంటికి మంటలంటుకొని సామగ్రి దగ్ధమైంది. కుటుంబసభ్యులు హైదరాబాద్‌కు వెళ్లారు. గురువారం రాత్రి ఇంట్లోంచి పొగలు రావడంతో స్థానికులు సమాచారం అందించారు. యువకులు, పోలీసులు, ఫైరింజన్ సిబ్బంది మంటలార్పారు. ఇంట్లోని సామగ్రి దగ్ధమైంది.

క్లుప్తంగా

పర్యాటక రంగంగా అభివృద్ధి


మొక్కులు చెల్లించుకుంటున్న ఎమ్మెల్యే కవ్వంపల్లి

ఇల్లంతకుంట: అనంతగిరి అన్నపూర్ణ ప్రాజెక్టు ప్రాంతాన్ని పర్యాటకరంగంగా అభివృద్ధి చేస్తామని మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. మండలంలోని అనంతగిరి పోచమ్మ ఆలయ వార్షికోత్సవ కార్యక్రమంలో గురువారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను ఆలయ కార్య నిర్వహణ అధికారి మారుతిరావు ఘనంగా సన్మానించారు. మహా చండీయాగంలో పాల్గొని అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ పెద్దగుట్ట వద్ద కల్వర్టు నిర్మాణానికి,పెద్ద లింగాపురం నుంచి అనంతగిరి బీటీరోడ్డు నిర్మాణానికి ప్రతిపాదనలు పంపించామన్నారు. అసంపూర్తిగా ఉన్న ఆలయ నిర్మాణానికి నిధులు మంజూరయ్యేలా చూస్తానన్నారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రాఘవరెడ్డి, ఐరెడ్డి మహేందర్ రెడ్డి, వెంకటి , వెంకటరమణారెడ్డి, ఐలయ్య, వినయ్‌కుమార్ ఆలయ జూనియర్ అసిస్టెంట్ ప్రభాకర్, ఈవో డివి మారుతీరావు, కాంగ్రెస్‌నాయకులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్య పరిష్కరించాలి



వీర్నపల్లి: మండల సెస్ డైరెక్టర్ మాదుగుల మల్లేశం ఆధ్వర్యంలో గురువారం మాజీ ప్రజాప్రతినిధులు సిరిసిల్లలో సెస్ చైర్మన్ చిక్కాల రామారావును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సెస్ డైరెక్టర్ మాదుగుల మల్లేశం మాట్లాడుతూ.. మండలకేంద్రంలో సీసీరోడ్డు పనుల్లో భాగంగా రోడ్డుపై విద్యుత్ స్తంభాలను తొలగించి తొలగించి సరిచేయాలని, వన్‌పల్లి, మద్దిమల్ల సబ్‌స్టేషన్లను ఏర్పాటు చేసి విద్యుత్ సమస్యలను పరిష్కరించాలన్నారు. దీనికి సెస్ చైర్మన్ సానుకూలంగా స్పందించి త్వరలోనే సమస్యలను పరిష్కరిస్తానన్నారు. మాజీ ఎంపీటీసీ ఫోరం అధ్యక్షుడు అరుణ్‌కుమార్, బంజార సంఘం జిల్లా అధ్యక్షులు సురేశ్‌నాయక్, బీజేపీ మండల అధ్యక్షుడు దేవేందర్ రెడ్డి, నాయకులున్నారు.

బీజేపీ దిష్టిబొమ్మ దహనం

గంభీరావుపేట: ఎల్లారెడ్డిపేట మండలకేంద్రంలో బీజేపీ దిష్టిబొమ్మను గురువారం కాంగ్రెస్ పార్టీ నాయకులు దహనం చేశారు. కులాలు, మతాల మధ్య చిచ్చు పెట్టే విధంగా బీజేపీ వ్యవహరిస్తుందని కాంగ్రెస్ నాయకులు ఆరోపించారు. బీజేపీ నాయకులు తన్వీందర్ సింగ్ రాహుల్‌గాంధీపై చేసిన వ్యాఖ్యలను కాంగ్రెస్ నాయకులు తీవ్రంగా ఖండించారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సయ్య, మండల అధ్యక్షుడు లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరణ


కుమార స్వామిని సన్మానిస్తున్న గంగారాం

రుద్రంగి: మండల సెస్ ఏఈగా గురువారం కుమారస్వామి బాధ్యతలు స్వీకరించారు. ఆయనను రుద్రంగి సెస్ డైరెక్టర్ ఆకుల గంగారాం శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కుమారస్వామి మాట్లాడుతూ ప్రజల, రైతుల విద్యుత్ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో సెస్ సిబ్బంది ఉన్నారు.

రక్తహీనతపై అవగాహన ఉండాలి



బోయినపల్లి: బాలింతలు, బాలికలు రక్తహీనత పరీక్షలు చేయించుకోవాలని ఎంపీడీవో బీమా జయశీల పేర్కొన్నారు. మండలంలోని బూర్గుపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో రక్తహీతన నిర్వహించారు. అనంతరం రక్తహీనతపై అవగాహన కల్పించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నిర్మల, పంచాయతీ కార్యదర్శి శ్రీకాంత్, టీచర్ శ్రీకాంత్, అంగన్‌వాడీ టీచర్లు పుష్పలత, రాజేశ్వరి, ఏఎన్ఎం శ్యామల, ఆశా కార్యకర్తలు ఉన్నారు.

గల్ఫ్‌లో గంభీరావుపేట వాసి మృతి

గంభీరావుపేట: గంభీరావుపేట మండల కేంద్రానికి చెందిన కరువారి దేవయ్య(46) గల్ఫ్‌లో మృతిచెందాడు. గతనెల 19న దుబాయ్‌కి వెళ్లాడు. రెండ్రోజుల తర్వాత అక్కడ తాను ఉంటున్న రూంలో ఫిట్స్ వచ్చాయి. స్నేహితులు ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ గత నెల 27న మృతిచెందాడు. ఈమేరకు కుటుంబసభ్యులకు సమాచారం అందింది. మృతదేహాన్ని స్వగ్రామానికి తెప్పించాలని కుటుంబసభ్యులు కోరుతున్నారు.



గంభీరావుపేట: మండలంలోని కొత్తపల్లిలో కోతుల బెడద తీవ్రంగా ఉంది. ఇళ్లపైకి కోతులు గుంపులుగా చేరి కిష్కింధకాండ చేస్తున్నాయి. రోడ్లపై గుంపులుగా సంచరిస్తుండడంతో ప్రజలు బయటకు రావడానికే వణికిపోతున్నారు. అధికారులు స్పందించి కోతుల నియంత్రణకు చర్యలు చేపట్టాలి.

–గౌటే గణేశ్, కొత్తపల్లి, గంభీరావుపేట

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి : రాజేశ్వర్‌గౌడ్, ఎంపీవో 9701781898

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్ : 9440243048, 9705346626

ఏకలవ్య స్కూల్‌లో కేంద్ర మంత్రి 'క్లాస్'







కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ గురువారం కోనరావుపేట మండలం మరిమడ్ల, ఎల్లారెడ్డిపేట మండలం దుమాల ఏకలవ్య పాఠశాలలను సందర్శించారు. పలు విషయాలపై టీచర్లకు, విద్యార్థులకు క్లాస్ తీసుకున్నారు. గోడకు కనిపించిన ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ఫొటో చూసి విద్యార్థులకు స్వాతంత్య్ర సమరయోధులను పరిచయం చేయాలి కానీ రాజకీయ నాయకులను కాదని సున్నితంగా చెప్పారు. అలాగే నుదుటన బొట్టు లేకుండా కనిపించిన విద్యార్థులకు రోజూ బొట్టు పెట్టుకుంటే మహాలక్ష్మిలా కనిపిస్తారని హితవు చెప్పారు. తరగతి గదుల్లో విరిగిపోయిన కిటికీలు, పనిచేయని ప్రొజెక్టర్ తదితర సమస్యలు పరిష్కరించాలని సూచించారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, రాజన్న సిరిసిల్ల

స్వచ్ఛదనం - పచ్చదనంపై అవగాహన


అవగాహన కల్పిస్తున్న కళాకారులు

సిరిసిల్ల అర్బన్: పట్టణంలోని 26 వార్డులో జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ ఆధ్వర్యంలో సాంస్కృతిక కళాకారులు స్వచ్ఛదనం-పచ్చదనంపై పాటలతో గురువారం అవగాహన కల్పించారు. కళాకారులు ఎడమల శ్రీధర్ రెడ్డి, రామచంద్రం, శ్రీనివాస్, గణేశ్, ప్రజలు పాల్గొన్నారు.

ముగిసిన సునీల్ అంత్యక్రియలు

రుద్రంగి: రుద్రంగి మండలకేంద్రానికి చెందిన తోపారపు సునీల్ బుధవారం జగిత్యాల జిల్లా బుగ్గారం మండలం వెల్గొండలో విద్యుత్‌షాక్‌కు గురై మృతిచెందిన విషయం తెలిసిందే. గురువారం రుద్రంగిలో సునీల్‌కు కుటుంబ సభ్యులు, బంధువులు అంత్యక్రియలు నిర్వహించారు. మృతుడి తల్లి, భార్య విలపించిన తీరు గ్రామస్తులను కంటతడి పెట్టించింది. నిరుపేద అయిన బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.

నివాళి



వేములవాడఅర్బన్: పద్మశ్రీ అవార్డు గ్రహీత కోట సచ్చిదానంద శాస్త్రి మృతిపట్ల వేములవాడలో కళాకారులు ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. రాష్ట్ర కళాకారుల విభాగం కన్వీనర్ యెల్ల పోశెట్టి మాట్లాడుతూ హరికథకు తొలిసారి పద్మశ్రీ అవార్డు అందుకున్న గొప్ప కళాకారుడు శాస్త్రి అన్నారు. కళాకారులు బొడ్డు రాములు, సత్తయ్య, వినీత్, రవి, శంకర్, రమేశ్, లక్ష్మిరాజం తదితరులు ఉన్నారు.

ఆర్థికసాయం అందజేత

ముస్తాబాద్: మండల కేంద్రానికి చెందిన బీడీ కార్మికుడు షరీపొద్దీన్ మృతిచెందగా బాధిత కుటుంబానికి తెలంగాణ బీడీ టేకేదారుల సంక్షేమ సంఘం ఆర్థిక సాయం అందించింది. సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్ పరామర్శించి రూ.15వేలు ఆర్థికసాయంగా అందించారు. సంఘం నాయకులు, తదితరులున్నారు.

డిగ్రీ కళాశాల మంజూరు చేయాలి


కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

ముస్తాబాద్: మండలకేంద్రంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని కోరుతూ రూపొందించిన కరపత్రాలను ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డిగ్రీ కళాశాల సాధన కమిటీ కన్వీనర్ చింతోజు బాలయ్య మాట్లాడుతూ నాలుగేళ్లుగా ముస్తాబాద్‌లో డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని ఉద్యమాలు చేశామని, మాజీ మంత్రి కేటీఆర్ కళాశాల మంజూరు చేసినట్లు ప్రకటన కూడా చేశారన్నారు. ఇప్పటికీ మంజూరుకాకపోవడంతో వేలాదిమంది విద్యార్థులు దూర ప్రాంతాలకు వెళ్తూ ఇబ్బంది పడుతున్నారన్నారు. ప్రభుత్వం స్పందించి కళాశాల మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ కామిటికార్ పద్మ, సుద్దాల దేవయ్య, జూనియర్ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

'స్వచ్ఛ తా హీ' సేవ


పిచ్చిమొక్కలు తొలగిస్తున్న సిబ్బంది

చందుర్తి : మండలంలోని ప్రాథమిక పాఠశాలలో స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా పాఠశాల ఆవరణలో చెత్త చెదారం తొలగించారు. అనంతరం విద్యార్థులకు పచ్చదనం, పరిశుభ్రతపై ఉపాధ్యాయులు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు వేముల సుజాత, ఉపాధ్యాయులు గుర్రం బాలకిషన్, కొత్తూరు ఎథర్, రాకం రవి, కాపిల్ల నరేశ్, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి, మమత, స్వప్న, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.